పోడియా సమితిలో ఉచిత వైద్య శిబిరం



మల్కన్‌గిరి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి మాటేరు గ్రామ పంచాయతీ కెంతరపని గ్రామం వద్ద కలిమెల సమితి ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సహకారంతో సోమ వారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కలిమెల ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ బిభుపస్ పాడీ హజార్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పోడియా, కెందుపరి, శతధుక్, తోలాలి గ్రామాలకు చెందిన 200 మంది వైద్య సేవలు పొందారు. కార్య క్రమంలో కేందుపరి సర్పంచ్ లక్ష్మణ్ మడకామి, పోడియా పంచాయతీ అధికారి ప్రసాద్ నాయక్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విరిగిపడిన భారీ వృక్షం



రహదారి మధ్యలో పడిపోయిన మామిడి చెట్టు

రాయగడ: జిల్లాలోని టికిరి సమీపంలో గల మండ్‌గుడ గ్రామం ప్రధాన రహదారి వద్ద సోమవారం ఉదయం భారీ మామిడి చెట్టు నేలకొరిగింది. రహదారి మధ్య చెట్టు పడిపోవడంతో టికిరి నుంచి రాయగడకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు కారణంగా చెట్టు నేల కొరిగినట్టు సమాచారం. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని చెట్టుని తొలగించారు. సోమవారం నాడు రాయగడలో కుండపోత వర్షం కురిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

● మరొకరికి గాయాలు



రాహుల్ అటక (ఫైల్)

రాయగడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మృతుడు చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కెవుటుగుడ గ్రామానికి చెందిన రాహుల్ అటక (27)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాయగడ నుంచి జేకేపూర్ వైపు స్కూటీపై సోమవారం వేకువ జామున రాహుల్ అతని స్నేహితుడు గురునాథ కొరకొరియాలు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ఖొల్లిగుడ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న రాహుల్ తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలం వద్దే మృతి చెందగా స్కూటీ నడుపుతున్న గురునాథ్ కొరకొరియా గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీసు



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన ఘటన

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంవీజే రావు ఒక ప్రయాణికుని ప్రాణాలు కాపాడి అందరి ప్రశంసలు అందుకున్నాడు. స్థానిక రైల్వే స్టేషన్ 5వ నంబరు ప్లాట్‌ఫారం 5లో సోమవారం ఈ ఘటన జరిగింది. విశాఖపట్నం నుంచి నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రాయగడకు చేరుకుంది. రాయగడ నుంచి బయల్దేరుతున్న సమయంలో తమిళనాడుకు చెందిన పృథ్వీరాజ్ అనే ప్రయాణికుడు నడుస్తున్న ట్రైనును ఎక్కాడు. మొబైల్ పడిపోవడంతో కిందకు దిగి మొబైల్ తీసుకునే ప్రయత్నంలో ట్రైన్ కిందకు పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఎంవీజే రావు అతడిని పట్టుకుని బయటకు లాగారు. దీంతో ప్రయాణికుడు మృత్యుకోరల నుంచి బయటపడ్డాడు. ప్రయాణికుడి తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ రావును అందరూ అభినందించారు.

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



రోడ్డు వేసుకుంటున్న గ్రామస్తులు

జయపురం: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఆ గ్రామస్తులు ఎదురు చూడలేదు. తమ గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించాలని అధికారులను వేడుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో వారే శ్రమదానంతో రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి కొలార్ పంచాయతీ ఖుడిగుడ నుంచి మలియగుడ గ్రామం వరకు కిలోమీటర్ దూరం రోడ్డు పూర్తిగా శిథిలమైంది. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అనువుగా లేదు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డును నిర్మించాలని వేడుకున్నారు. ఎన్నికల సమయంలో ఎన్నెన్నో వాగ్దానాలు చేసిన నాయకులు ఆ తరువాత పట్టించుకోలేదు. విసిగి వేసారి ఎవరో వచ్చి రోడ్డు వేస్తారన్న నమ్మకం పోవడంతో శ్రమదానంతో రోడ్డు నిర్మించుకోవాలని సంకల్పించారు. ఆచరణను అమల్లోకి తెచ్చారు. ఖుడిగుడ నుంచి మలియగుడ వరకు రోడ్డు వేయటానికి సోమవారం శ్రీకారం చుట్టారు.

కదం తొక్కిన రైతులు



జాతీయ రహదారిపై ఆందోళనకారులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాలోని రైతులు సోమవారం సీక్‌పల్లి పంచాయతీలో కదం తొక్కారు. సకాలంలో అందాల్సిన యూరియా, ఎరువులు అందడం లేదని తెలిపారు. ఎరువులు అందించాలని నవనిర్మాణ రైతు సంఘం తరుపున మల్కన్‌గిరి-కలిమెల ముఖ్యరహదారిపై ఆందోళన చేశారు.

రైతులకు అండగా బీజేడీ

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో రైతులు ఎరువులు లభించక పడుతున్న ఇబ్బందులపై బిజూ జనతా దళ్ పార్టీ తీవ్రంగా పరిగణించింది. సకాలంలో ఎరువులు లభించనందున జయపురం సబ్‌డివిజన్‌లో జయపురం, కొట్‌పాడ్, బొరిగుమ్మ, కుంధ్ర, బొయిపరిగుడ సమితుల రైతులు మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని ముట్టడించేందుకు తీసుకున్న నిర్ణయానికి బీజేడీ మద్దతు ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రబినారాయణ నందో సోమవారం తెలిపారు. జయపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సకాలంలో ఎరువులు సమకూర్చనందుకు జయపురం సబ్‌డివిజన్‌లో గల రైతులు ఆయా సమితుల్లో గల లేంప్ప కార్యాలయాల వద్ద, వ్యవసాయ విభాగాల కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు. అందుకే రైతులకు మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కృషక కల్యాణ మంచ్ కార్యదర్శి నరేంద్ర కుమార్ ప్రధాన్, సీనియర్ బిజేడి నేతలు బాలారాయ్, దుర్గా మిశ్రాలు పాల్గొన్నారు.



రైతులతో చర్చిస్తున్న పోలీసులు, ప్రభుత్వాధికారులు



ధర్నాలో పాల్గొన్న వందలాది మంది గిరిజన రైతులు



పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రబినారాయణ నందో తదితరులు

రెండు మృతదేహాలు స్వాధీనం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది





రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: నదిలో వివాహిత మృతదేహాన్ని బిసంకటక్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు బిసంకటక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కచాపాయి గ్రామానికి చెందిన సువా ప్రస్కా భార్య కవితా కంభారిక (23)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు . ఈ మేరకు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం కంభారిక కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతికారు. అయితే సోమవారం కొంతమంది కచాపాయి గ్రామానికి సమీపంలోని కుందనపదర్ డ్యాం వద్దకు స్నానానికి వెళ్లగా అందులో మహిళ మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు. కవితా కంభారిక ఆత్మహత్య చేసుకుందా లేక ఎవరో హత్య చేసి డ్యాంలో పడివేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుని మృతదేహం..





నదిలో తుప్పల మధ్య సుకు సాబొరో మృతదేహం

రాయగడ జిల్లా గుణుపూర్ సమీపంలోని సన్నొనదిని దాటుతున్న సమయంలో నీటి ప్రవాహానికి కొట్టుకు వెళ్లి గల్లంతైన సుకు సాబొరో (50 మృతదేహం లభ్యమయ్యింది. శుక్రవారం తన పంటపొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మధ్యలో సన్నొనదిని దాటుతున్న సమయంలో గల్లంతయ్యాడు. సోమవారం అతని మృతదేహం నదికి కొంతదూరంలో లభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయపురం సబ్‌జైల్ పరిశీలన



పత్రికా ప్రతినిధుల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ తదితర పోలీసు అధికారులు

జయపురం: జయపురం స్వతంత్ర సబ్‌జైలును ప్రతి నెల తాను గానీ తన ప్రతినిధి గానీ సందర్శించి జైలు పరిస్థితులు తెలుసుకుంటామని కొరాపుట్ ఎస్పీ రోహిత్‌కుమార్ వర్మ తెలిపారు. ఆయన సోమవారం జయపురం సబ్‌జైల్‌ను సందర్శించారు. జైలులో ఉన్న ఖైదీల పరిస్థితి, వారికి బయట వ్యక్తులతో ఉన్న పరిచయాలుపైన వాకబు చేశారు. అలాగే జైలులో ఉన్న ఖైదీల ఉంటున్న పరిసరాల పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన వారి గురించి తెలుసుకున్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండగ సమయంలో పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోందని తెలిపారు. జైలులో ఉండే ఖైదీలు బయటకు వచ్చి ఏం చేస్తున్నారో తెలుసుకుంటున్నామన్నారు. తాము జైలు సందర్శించిన సమయంలో జైలులో ఎలాంటి మాదక ద్రవ్యాలు, నిషా వస్తువులు, గుడాకు, మొబైల్ ఫోన్లు కనిపించలేదని వెల్లడించారు. పండగ సమయాల్లో దొంగలు యాక్టివ్ అవుతారని, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీతో పాటుపట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్, జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మల్కన్‌గిరి యువకుడు



జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ఆడేందుకు ఎంపికైన జిల్లా కోయగిరిజన యువకుడు ఆకాష్ పడియమి

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా లోని కోయ సమాజానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మల్కన్‌గిరి సమితి గొరాఖుంటా పంచాయతీ కృషుబేడ గ్రామానికి చెందిన ఆకాష్ పడియామికి స్వల్ప దృష్టిదోషం ఉంది. ఇతను 4వ తరగతి చదివి పంచాయతీలో ఉన్న హైస్కూల్ పరీక్షల అనంతరం రాయగడ జిల్లాలో మునిగూఢ సమితిలో ఉన్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ వరకు చదివాడు. ఆపై రెవెన్షా విశ్వ విద్యాలయంలో డిగ్రీలో చేరి ఫుట్‌బాల్ ఆడడం మొదలుపెట్టాడు. క్రికెట్, ఫుట్‌బాల్ రెండింటిలోనూ చక్కటి ప్రదర్శన కనబరిచాడు. అక్కడి నుంచే అంధుల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆటగాడు ఆశిష్ కుమార్ సాహు, ఒడిశా బ్లైండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు త్రిలోచన్ బెహరా ఆహ్వానం మేరకు ఒడిశా బ్లైండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో స్థానం పొందాడు. 2023లో జార్ఖండ్, టాటానగర్, జంషెడ్‌పూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇండియన్ బ్లైండ్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ పోటీల్లో ఒడిశా తరపున ఆడాడు. అక్కడ ఉత్తమ గోల్‌కీపర్‌గా ప్రశంసలు అందుకున్నాడు. తర్వాత 7వ ఎడిషన్ నేషనల్ కప్‌లో పాల్గొన్నారు. మహారాష్ట్ర పూణే, మధ్యప్రదేశ్ గ్వాలియర్, అలాగే అస్సాంలోనూ తన ప్రతిభ చాటాడు. గుజరాత్ ,అహ్మదాబాద్ లో జరిగిన నేషనల్ బ్లైండ్ ఫుట్‌బాల్ లీగ్ -సీజన్ 1లో తన గురువు అయినై ఆశిష్ కుమార్ సాహుతో కలిసి కేరళ రాష్ట్రంలోని త్రి టూవన్ హీరోస్ జట్టుకు ఎంపికయ్యాడు. ఆగస్టు 11 నుంచి 13 వరకు కేరళలో జరిగిన జాతీయ శిక్షణ శిబిరానికి హాజరై భారత బ్లైండ్ ఫుట్‌బాల్ జట్టులో చోటు సాధించాడు. తన విజయంపై ఆకాష్ మాట్లాడుతూ మల్కన్‌గిరి జిల్లాలో ఓ మారుమూల గ్రామంలో ఓ గిరిజన కోయ తెగ నుంచి ఈ స్థాయిక రావడం తన అదృష్టమన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు

కొరాపుట్: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభించాడానికి కమిటీ సభ్యులు అమ్మవారి అనుమతి కోరారు. నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బందారు ఘరణి మందిరాన్ని మెయిన్ రోడ్డుకి చెందిన జై మా దుర్గా పూజా కమిటీ సభ్యులు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు గత 40 ఏళ్లుగా ఉత్సవాలు చేస్తున్న పూజా కమిటీ సభ్యులు ఈ ఏడాది తమ ఏర్పాట్లు ప్రారంభించడానికి వచ్చారని అమ్మవారికి విన్నవించారు. అనంతరం అమ్మవారి పూజా సామగ్రిని ఉత్సవ కమిటీకి అందించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మృత్యుంజయ్ దాస్ (టునా) మాట్లాడారు. ఉత్సవాలు ప్రారంభ పనులు చేసే ముందు బందారు ఘరణి అమ్మవారికి నివేదించడం దశాబ్దాలుగా వస్తున్న ఆచారంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సిమ్మాంచల్ రథ్, సారథి సాహు, సర్వేశ్వర్ సాహు, టునా బెహరా, బిశ్వనాథ్ రథ్, కపిల్ పూజారి, తంగుడు శ్రీకాంత్ ఉన్నారు.

బిరికోట్‌లో విద్యుత్ షాక్‌తో మెకానిక్ మృతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ బిరికోట్ గ్రామంలో ఒక ఇంటిలో మోటారు పంపు సెట్టు మరమ్మతు చేస్తున్న సమయంలో హఠాత్తుగా విద్యుత్ సరఫరా అవ్వడంతో మెకానిక్ మృతి చెందినట్టు అడవ పోలీసు ఐఐసీ సుబ్రాంత పండా తెలియజేశారు. మృతుడు బరంపురానికి చెందిన ప్రపుల్ల బడతియా (45)గా పోలీసులు నిర్ధారించారు. తొలుత అడవ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ప్రపుల్ల బడతియాను స్థానికులు చేర్చిన అనంతరం ప్రాథమిక చికిత్స చేస్తుండగా మృతి చెందినట్టు డాక్టరు అమరేష్ పాత్రో ప్రకటించారు. అడవ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. అడవ పోలీసు ఐఐసి సుబ్రాంత పండా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ చాందిపుట్ గ్రామంలో అరకిత మహాంకుడో అనే వ్యక్తి రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. మోహన పీఎస్ పరిధిలో చాందిపుట్ జంక్షన్ వద్ద ఒక షాపు యజమాని సోమవారం తన షాపును కట్టి బహిర్భూమికి జాతీయ రహదారి పక్కన బహిర్భూమికి వెళ్తుండగా వాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. ఆయనను తొలుత చంద్రగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చిన తర్వాత పరిస్థితి విషమించడంతో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి అంబులెన్సులో తరలించినట్టు మోహన పోలీసు అధికారి బసంతకుమార్ సెఠి తెలియజేశారు.

పోక్సో కేసు నిందితుడికి 20 ఏళ్ల జైలు

● రూ.10 వేల జరిమానా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆర్.ఉదయగిరి పోక్సో కేసులో నిందితుడు సంతోష్ శోబోరోకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి బిభు ప్రసాద్ పండా తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం తుది తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా తెలియజేశారు. నిందితుడు సంతోష్ శోబోరో బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి పలుసార్లు లైంగిక దాడిచేసినట్టు ప్రాసిక్యూషన్ నిరూపించింది. నిందితుడిపై ఆర్.ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ దుష్యంత్ కుమార్ అమంత కేసు నమోద చేశారు. ఈ కేసులో బాధితురాలి తరపున ప్రభుత్వ పీపీ ఆర్.జనార్ధనరావు వాదించారు. డిఫెన్సు లాయర్‌గా అరుణ్ కుమార్ పరిడా వాదించారు. బాధితురాలకి రూ.4లక్షల నష్టపరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ ఆదేశించారు.


డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



బాధిత గ్రామంలో గిరిజన మహిళతో సంభాషిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్:

డయేరియా ప్రభావిత ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత పర్యటించారు. సోమవారం కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి ఒడాపుర్ గ్రామంలో నలుగురు మృతి చెందారు. వీరంతా వాంతులు, విరేచనాలతో మృతి చెందారు. మరో ఐదుగురు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య శాలలో చికిత్స పొందుతున్నారు. మరో వైపు ప్రత్యేక వైద్య బృందం బాధిత ప్రాంతంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తోంది. గ్రామంలో ఎండిన రొయ్యిల గుండ తినడంతో అనారోగ్యం పాలైనట్లు గిరిజనులు పేర్కొన్నారు. గ్రామంలో గిరిజనులు ప్రభుత్వం అందిస్తున్న మందులు తిరస్కరిస్తున్నారు. సమీప ప్రాంతాలకు చెందిన మంత్రగత్తెలను సంప్రదించి పూజలు చేయిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఎమ్మెల్యే అక్కడ పర్యటించారు. గిరిజనులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇస్తున్న మందులు వాడాలని సూచించారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

మోడలింగ్‌లో..
నబరంగ్‌పూర్ బాలుడి ప్రతిభ



అంతర్జాతీయ మోడలింగ్‌లో నబరంగ్‌పూర్‌కి చెందిన బాలుడికి ప్రథమ స్థానం లభించింది. సోమవారం వియత్నాం దేశంలో అంతర్జాతీయ బాలల మోడలింగ్ పోటీలు ముగిశాయి. అందులో జిల్లాకు చెందిన దివంగత మాజీ మంత్రి హబిబుల్లా ఖాన్ మనుమడు తాహిద్ హసన్ ఖాన్ గెలిచాడు. తాహిద్ తండ్రి తారిఖ్ హసన్ ఈ వివరాలు ప్రకటించారు. వివిధ దేశాలకు చెందిన 57 మంది ఈ ఫైనల్ పోటీల్లో పాల్గొన్నారు. తాహిద్ ప్రస్తుతం భువనేశ్వర్‌లో యూనిట్-8 డీఏవీ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు.

కొరాపుట్

క్లుప్తంగా

హత్య కేసులో ఆరుగురి అరెస్టు

రాయగడ: ఒక హత్య కేసుకు సంబంధించి శెశిఖాల్ పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో సన్నోసిగురు గ్రామానికి చెందిన పరమేశ్వర్ తాడింగి, బలరాం మండంగి, అక్షయ తాడింగి, మేత్రీ జిలకర, మానస్ తాడింగి, రబి కిలకలు ఉన్నారు. సనోసిగురు గ్రామంలో నివసిస్తున్న నారాయణ మండంగి (60) అనే వృద్ధుడిని అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చేతబడి చేస్తున్నాడన్న నెపంతో పది రోజుల క్రితం హత్య చేశారు.. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం నిందితులను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

తోటగుమ్మడలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పర్లాకిమిడి: గుసాని సమితి మధుసూదనపురం పంచాయతీ తోటగుమ్మడ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు 54 మంది రోగులకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. జై హనుమాన్ మెడికల్ షాపు యజమాని ప్రకాశరావు పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

పర్లాకిమిడి: సెప్టెంబరు 13వ తేదీన గజపతి జిల్లా కోర్టు పర్లాకిమిడి, ఆర్.ఉదయగిరి, మోహానా, కాశీనగర్‌లలో తృతీయ రాష్ట్రీయ లోక్ అదాలత్ జరగనుందని జిల్లా జడ్జి సోమవారం తెలియజేశారు. విచారణలో ఉన్న కేసులు, చెక్‌బౌన్స్, బ్యాంకు రుణాలు, మోటారు వాహన దుర్ఘటన నష్టపరిహారం, కార్మిక, లోక్ సేవా, విడాకుల కేసులు విచారణ జరుగుతాయని జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రవుళో తెలిపారు. రాష్ట్రీయ లోక్ అదాలత్‌లో విచారణకు ప్రజలకు ఎటువంటి ఆర్థిక భారం ఉండదన్నారు. ఇతరత్రా వివరాలకు జిల్లా న్యాయ సలహా ప్రాధికరణ కార్యాలయం, పర్లాకిమిడి, ఆర్.ఉదయగిరి, మోహానా కోర్టులో కక్షిదారులు సంప్రదించవచ్చని తెలియజేశారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం సభ్యుడు మల్లికార్జున పట్నాయక్

పర్లాకిమిడి: పట్టణంలోని రాజగురు వీధిలో గౌరహరి గ్రంథాలయంలో సోమవారం గజపతి జిల్లా మాజీ సైనికుల సంఘం సమావేశం నిర్వహించారు. కెప్టెన్ ఎస్.సీ.దాస్ ఈ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మాజీ సైనికులకు పింఛన్, తదితర సమస్యలపై చర్చించారు. మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలపై అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షుడు బి.కె.రావు, మనోజ్ దాస్, భవానీ శంకర్ ఆచార్య, మల్లికార్జున్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

శ్రీకాకుళం: జిల్లాలో డీఎస్సీ నుంచి పలు కేటగిరీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28 నుంచి జరుగుతుందని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు. అభ్యర్థులు తమ లాగిన్ ఐడీ ద్వారా మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పత్రాల పరిశీలనకు వచ్చినప్పుడు అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇటీవల జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్య ధ్రువీకరణ పత్రం, కాల్ లెటర్లో సూచించిన ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పారు. అలాగే గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కూడా తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ సమయాల్లో తప్పకుండా పరిశీలనకు హాజరుకావాలని, లేకుంటే వారి అభ్యర్థిత్వం రద్దు చేస్తామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావడానికి ముందు ఆయా పత్రాలను వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతిమ..ప్రతిభ



విద్యార్థులు తయారు చేసిన ప్రతిమలు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు జి.ఉమాదేవి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలే వాడాలని పిలుపునిచ్చారు.



రాయగడ: సమస్యలను వింటున్న కలెక్టర్ కులకర్ణి, ఎస్పీ స్వాతి



పర్లాకిమిడి: ఖరిగుడలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్



పర్లాకిమిడి: మల్లిక్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ మధుమిత

వినతుల వెల్లువ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి పనాస్‌పూట్ పంచాయతీలో సోమవారం జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ గ్రీవెన్స్‌లో పాల్గొని వినతులు స్వీకరించారు. మొత్తం 112 వినతులు అందాయి. సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ఓ క్యాంప్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో సేవలు అందించాలని ఆయా శాఖల ఉద్యోగులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, సబ్ కలెక్టర్ అశ్ని ఎ.ఎల్, చిత్రకొండ బీడీఓ, తహసీల్దార్, జిల్లా ఎన్నికల అధికారి ఆశోక్ చక్రవర్తి పాల్గొన్నారు.

మునిగుడలో..

రాయగడ: జిల్లాలోని మునిగుడలో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి పాల్గొని 109 వినతులను స్వీకరించారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ దిల్లీప్ దుదుల్ అభిషేక్, జిల్లా ముఖ్యవైద్యాధికారి బి.సరోజిని దేవి, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ తదితరులు హాజరయ్యారు. మునిగుడ సమితి పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వీకరించిన వినతుల్లో 91 వ్యక్తిగతమైన సమస్యలు, 18 సామూహిక సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా 8 మందికి రూ.1.10 లక్షల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందించారు.

మోహనా బ్లాక్‌లో..

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా సమితి ఖరిగుడ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ మధుమితతోపాటు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు హాజరయ్యారు. మోహనా బ్లాక్ ఖరిగుడ పంచాయతీలో రాయిపంక, మండిమర, బిరికోట్ గ్రామాల నుంచి మొత్తం 148 వినతులు అందాయి. వాటిలో గ్రామ సమస్యలు 116 ఉన్నాయి. ఇద్దరు నిస్సహాయులకు జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సహాయ నిధి నుంచి రూ.15 వేలు అందజేశారు. మోహనా బ్లాక్ అడవ పంచాయతీ జోమ్మిగుడ గిరిజన పేద విద్యార్థి నిరో మల్లిక్ నీట్‌లో విజయం సాధించి బరంపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందినందుకు కలెక్టర్ మెమొంటో అందజేశారు. పలువురికి ఇళ్లు, భూపట్టాలు (ఆర్.ఓ.ఆర్) అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహనా బ్లాక్ చైర్మన్ రాజీవ్ శోబోరో, బీడీఓ రాజీవ్ దాస్, జిల్లా ముఖ్య వైద్యాధికారి, జన స్వస్థ అధికారి డాక్టర్ ఎం.ఎం.ఆలీ, బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.




మల్కన్‌గిరి: గ్రీవెన్స్‌కు వచ్చిన గిరిజనులతో చర్చిస్తున్న కలెక్టర్



మల్కన్‌గిరి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్

వనామీకి.. వరుణ గండం..!





అంపలాం వద్ద వర్షపు నీటితో నిండిపోయిన రొయ్యల చెరువు

- చెరువుల్లో చేరుతున్న వర్షపు నీరు
- నీటిని తోడే క్రమంలో పోషకాలు కోల్పోతున్న వైనం
- అదనపు ఖర్చు అవుతోందని ఆక్వా రైతు ఆందోళన

పోలాకి: ఒకప్పుడు రొయ్యల సాగు చేసే ఆక్వా రైతు మీసం మెలేసే పరిస్థితుల నుంచి, ఏరోజుకు ఏరూపంలో కష్టనష్టాలు ఎదురొస్తాయోనని నిత్యం భయపడేస్థాయికి మారింది పరిస్థితి. ఇప్పుడు తాజాగా వర్షాకాలం కావడంతో న్యూట్రిషన్స్ కొరత రూపంలో కొత్తకష్టం వచ్చిపడింది. జిల్లాలో ఎక్కువగా ఉప్పునీటి వనామీ కల్చర్ సాగు చేస్తున్న రైతులు చెరువుల్లో నీటిని నిల్వచేసే సమయంలో 10 శాతం కనిష్ట స్థాయి నుంచి 30 శాతం గరిష్ట స్థాయి వరకు లవణ శాతాన్ని కొనసాగిస్తారు. అదే క్రమంలో రొయ్యల ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, లిపిడ్లు, కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, ఖనిజాలు మరియు ఇతర పోషకాలు సైతం ఉండేలా ఏర్పాటు చేసుకుంటారు. అయితే ఇటీవల వర్షాలకు చెరువుల్లో వర్షపు నీరు చేరడంతో ఆ నీటిని బయటకు తోడాల్సి వస్తోంది. దీంతో సదరు లవణ శాతంతో పాటు పోషకాలు కూడా బయటకు పోతున్నాయి. ఫలితంగా రొయ్య ఎదుగుదలలో మేతతో సమానంగా అందాల్సిన పోషకాల కొరత ఏర్పడుతోంది. ఈ సమయంలో మళ్లీ ప్రొబయోటిక్స్ మొదలుకుని న్యూట్రిషన్స్ బ్యాలెన్స్ చేయడం కోసం వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ ఒడిదుడుకుల నేపథ్యంలో ధరలు సైతం పతనమైన పరిస్థితుల్లో మళ్లీ పోషకాల కోసం అదనపు ఖర్చులు పెట్టాలంటే తడిసిమోపుడవుతోందని వాపోతున్నారు.

సబ్సిడీపై పట్టించుకోని పాలకులు

ఆక్వా సాగులో కేవలం పోషకాల కోసం మొత్తం సాగు ఖర్చులో 20 శాతం కేటాయించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే పోషకాలు సబ్సిడీపై అందించాలని ఎప్పటినుంచో రొయ్యల రైతులు, సంబంధిత సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ప్రధాన పోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, క్లోరైడ్స్ వంటివి రాయితీపై అందిస్తే కొంత ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. మార్కెట్‌లో ఎకరాకు అయ్యే పోషకాల విలువ దాదాపుగా రూ.2,500 వరకు ఉంది. పంటకాలంలో పరిస్థితులను బట్టి 10 నుంచి 12 సార్లు వాడాల్సి ఉండగా వర్షాకాలం అదనంగా మరో 5 దఫాలుగా వాడుతున్నారు. అయితే సదరు పోషకాలు సబ్సిడీపై అందించాలని ఎప్పటినుండో ఆక్వా రైతులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదు. అందువలన ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పోషకాల ఖర్చును గుర్తించి ఆక్వా రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

అవగాహన పెంచుకోవాలి



ఆక్వా రైతులు పోషకాల వినియోగంపై ఇంకా అవగాహన పెంచుకోవాల్సి ఉంది. కేవలం అవగాహనతోనే పోషకాల ఖర్చుల్లో నియంత్రణ వస్తుంది. రొయ్యలు లేదా చేపల పెంపకంలో నీరుకూడా దాగి ఉన్న పోషకంగా పరిగణించబడుతుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నీటిని బయటకు తోడాల్సి వచ్చినపుడు అదనపు పోషకాలు అందించక తప్పదు.

– డాక్టర్ హెచ్.డిల్లీశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్, గుప్పెడుపేట సచివాలయం

ధరలు పెరుగుతున్నాయి



రొయ్యల ధరల్లో అనేక కారణాలతో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ పోషకాల ధరలు మాత్రం ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గతంతో పోల్చితే పోషకాల వినియోగం ఎక్కువైంది. వర్షాకాలంలో నీటిని బయటకు తోడితే పోషకాలు సైతం మళ్లీ అందించాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఆక్వా అభివృద్ధి కోసం పోషకాలు రాయితీపై అందిస్తే బాగుటుంది.

– పల్లి సింహాచలం, ఆక్వా రైతు, డీఎల్‌పురం

సబ్సిడీపై అందజేయాలి



ఒకప్పుడు విద్యుత్ లేదా డీజిల్ కోసం పెట్టే ఖర్చుతో చాలా ఇబ్బంది ఉండేది. ప్రభుత్వాలు కల్పించుకుని రాయితీ ఇవ్వడంతో ఆ ఖర్చులు బాగా తగ్గాయి. ఆదే క్రమంలో పోషకాలు, మేతలు, రొయ్య పిల్లలకు సైతం రాయితీలు దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తే ఆక్వా మరింత అభివృద్ధి దిశగా అడుగులు పడతాయి. దీంతో ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది.

– తిర్లంగి శ్రీనివాసరావు, ఆక్వా రైతు, పిన్నింటిపేట

హిందూ పరిరక్షణకు లక్ష్మణానంద కృషి అభినందనీయం



ప్రసంగిస్తున్న కమలలోచన విశ్వాల్

జయపురం: హిందుత్వ పరిరక్షణకు వేదాంత కేశరీ స్వామి లక్ష్మణానంద సరస్వతి కృషి చిరస్మరణీయమని పలువురు వీహెచ్‌పీ ప్రతినిధులు అన్నారు. స్థానిక నెహ్రూనగర్‌లోని అగ్రసేన్ భవనంలో విశ్వ హిందూ పరిషత్ 61వ ప్రతిష్ఠాదినం సందర్భంగా వేదాంత కేశరీ స్వామి లక్ష్మణానంద సరస్వతీ బలిదాన స్మృతి కార్యక్రమం నిర్వహించారు. వీహెచ్‌పీ ప్రాంతీయ ఉపాధ్యక్షులు బాబూ భాయి భజరంగ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయపురం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు తేజేశ్వర పండ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జయపురం జిల్లా కార్యదర్శి కమళలోచన బిశాయి మాట్లాడుతూ.. వీహెచ్‌పీ క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ప్రతివారిని సభ్యులుగా చేర్చేందుకు ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జయపురం విభాగ కార్యదర్శి నవకృష్ణ రథో, జిల్లా కోశాధ్యక్షులు గంగాధర నాయిక్, ఒడిశా అమలా సంఘ అధ్యక్షులు శశిభూషణ దాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు నివేదిత రథ్ పాల్గొన్నారు.

10 మంది గంజాయి నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవిలు

రణస్థలం: గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతున్న 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ మేరకు జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రణస్థలం మండలంలోని పైడిభీమవరం భూమాత టౌన్‌షిప్ వద్ద 22.5 కేజీల గంజాయితో ఐదుగురు నిందితులను జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవితో పాటు సిబ్బంది ఈనెల 24న తొలుత పట్టుకోవడం జరిగిందని తెలియజేశారు. ఆ నలుగురి నిందితులకు గంజాయి అమ్మకాలు, కొనుగోలు జరిపిన, సహకరించిన మరో ఐదుగురు నిందితులను అదుపులోనికి తీసుకున్నామని చెప్పారు.

ఒడిశా నుంచి గంజాయి

ఈనెల 23వ తేదీన బగాన పవన్ కుమార్, ఇనాకోటి ముకుందాతో కలిసి దినేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఒడిశాలోని కొరాపుట్ దగ్గర ఉన్న పొత్తంగి వెళ్లి గుంత శుక్ర అనే వ్యక్తి దగ్గర 22.5 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడ నుంచి గుంత శుక్రకు స్నేహితులను పరిచయం చేస్తానని చెప్పి ముగ్గురు ద్విచక్ర వాహనంపై పైడిభీమవరం వచ్చారు. భూమాత టౌన్ షిప్ వద్ద గంజాయి సేవిస్తూ, తెచ్చిన 22.5 కేజీల 5 ప్యాకెట్లను విభజించి స్నేహితుల ద్వారా అమ్మకాలు జరిపేందుకు పన్నాగం పన్నారు. తుపాకుల అనిల్ కుమార్, లక్కవరపు పవన్ కుమారులు ఇందులో కొంతమొత్తం హైదరాబాద్‌లోని బాడాన సామిత్, బెంగళూరులోని మొదలవలస సందీప్‌కు అమ్మడానికి తీసుకుని ఉండగా జేఆర్‌పురం పోలీసులు పట్టుకున్నారు. బగాన పవన్ కుమార్‌పై గతంలో ఎచ్చెర్లలో గంజాయి కేసు నమోదై ఉంది. అరెస్టైన వారిలో బగాన పవన్ కుమార్, ఇనకోటి ముకంద, గుంత శుక్ర, తుపాకుల అనిల్ కుమార్, లక్కవరపు కోట పవన్ కుమార్, లంకపల్లి దినేష్, ఆళ్ల వెంకటరావు, సురవరపు వరప్రసాద్, బనిశెట్టి భాను వెంకటప్రతాప్, ముడిల మోహన్ వెంకట ప్రతాప్‌లు ఉన్నారు.

యోగాసన పోటీల్లో మెరిసిన శ్రీకాంత్

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో రెండు బంగారు పతకాలతో మెరిశాడు. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్ షిప్ – 25 పోటీల్లో శ్రీకాంత్ మహంతి 28 నుంచి 35 ఏళ్ల విభాగంలో బంగారు పతాకాలు సాధించాడు. దీంతో ఆయనను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు అభినందించారు.

దంపతుల ఆత్మహత్యపై వివరాల సేకరణ

శ్రీకాకుళం: గార మండలం అంపోలులో అప్పారావు దంపతుల ఆత్మహత్య ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా బృందం సోమవారం అంపోలులో పర్యటించింది. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆ దంపతుల కుమార్తెను కూడా పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం మాట్లాడుతూ పెన్షన్ రద్దు ఆందోళనతో తీవ్ర మనస్తాపానికి గురై అప్పారావు దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, ఇంకోవైపు పెన్షన్ తొలగింపు భయం ఆయనను వెంటాడాయని వివరించారు. తల్లితండ్రులను కోల్పోయి అనాథగా మారిన బాలికకు ప్రభుత్వం స్పందించి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.సూర్యడమ్మ ఎం.లక్ష్మి, డి.లక్ష్మి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంగమ్మ, జి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులు అందరూ వారి కేసులను అవకాశం ఉన్నంత మేరకు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని, సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. కక్షిదారులతో న్యాయవాదులు మాట్లాడాలని లోక్ అదాలత్‌లో పరిష్కారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చవితి పండగ.. ప్రకృతికి అండగా



- మట్టి వినాయకులనే పూజిద్దాం
- స్థానిక వనరులతో పూజలు
- ఉత్సవ కమిటీలకు సూచనలు

శ్రీకాకుళం కల్చరల్: చవితి సంబరానికి అంతా సిద్ధమైంది. కాసిన్ని జాగ్రత్తలు తీసుకోగలిగితే పండగ చూసి ప్రకృతి కూడా నిండు గుండెతో నవ్వుతుంది. మట్టి విగ్రహాలను పూజించడం, ప్లాస్టిక్‌ను వినియోగించకపోవడం, స్థానికంగా దొరికే వస్తువులను వాడడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకుంటే చవితి మరింత ప్రత్యేకమవుతుంది.

స్థానిక వనరులే మేలు..

గణపతిని పూజించేందుకు ఎన్నో వస్తువులు అవసరమవుతాయి. ఆన్‌లైన్ అనకుండా ఊరిలో వ్యాపారుల వద్ద కొంటే వారికి ఉపాధి దొరుకుతుంది.

మట్టే ముద్దు



చవితి పూజకు మట్టి వినాయకుడిని మించిన విగ్రహం లేదు. మన స్థానిక కుమ్మర్లు ఎంతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారుచేస్తున్నారు. ఇళ్లలో పెట్టుకునేందుకైనా వీరి వద్దే కొంటే పర్యావరణానికే కాదు వారికీ మేలు జరుగుతుంది.

సింథటిక్ శాలువాలు వద్దు

కమిటీ సభ్యులు కొందరిని స త్కరించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో సింథటిక్ శాలువాలతో కాకుండా నేత వస్త్రాలతో సత్కరిస్తే మన నేతన్నలకు ఉపాధి దొరుకుతుంది. విగ్రహానికి వేసే కండువాలను కూడా ఖాదీది వాడితే మేలు.



పాలథిన్ వద్దు..



పూజా సామగ్రిలో వీలైనంత వరకు పాలిథిన్ వస్తువులు వినియోగించకపోవడం మేలు. పాల ప్యాకెట్లు కాకుండా స్థానికంగా దొరికే పాలు వాడుకుంటే ఇంకా మంచిది.

డీజేలు కావాలా..?



వినాయక నిమజ్జనాల్లో డీజేల శబ్దాలు ఉండకపోతేనే మేలు. డీజేలు వాడడం వల్ల సౌండ్ పొల్యూషన్ ఏర్పడి మనషుల చెవులు, గుండెలకు ఇబ్బందులు వస్తాయి.

ఆహారం వృధా చేస్తున్నారా..?

రోజూ తయారు చేసే ప్రసాదం ఒక వేళ మిగిలిపోతే వృధా చేయవద్దు. పేదలకు అందేలా చూడాలి.



జిల్లాలో జడివాన

జిల్లా వ్యాప్తంగా సోమవారం వానలు కురిశాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కువగా మందసలో 36 మిల్లీమీటర్లు, నందిగాంలో 27 మిల్లీమీటర్లు, మెళియాపుట్టిలో 19 మిల్లీమీటర్లు, ఎల్ఎన్ పేట, హిరమండలంలలో 15.5 మిల్లీమీటర్లు, నరసన్నపేటలో 11 మిల్లీమీటర్ల వాన కురిసింది. మిగిలిన చోట్ల చెదురుమదురు జల్లులు కురిశాయి. మంగళవారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. – శ్రీకాకుళం పాతబస్టాండ్



శ్రీకాకుళంలో వానలో ప్రయాణిస్తున్న వాహనదారులు

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: కంటకాపల్లి, కొత్తవలస రైల్వే లైన్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నామని ప్రభుత్వ రైల్వే ఎస్సై బాలాజీరావు సోమవారం తెలిపారు. మృతుడికి సుమారు 30నుంచి 35 ఏళ్ల వయస్సు ఉంటుందని సుమారు 5 అడుగుల 6 అంగుళాల పొడవు ఉంటాడన్నారు. చామన ఛాయ రంగుతో ఉన్న మృతుడు ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, లైట్ గ్రే కలర్, నీలం రంగు గల షార్ట్‌తో ఉన్నాడన్నారు. ఆ వ్యక్తిని గుర్తు పట్టినట్లయితే ఫోన్ 9490617089, 6301365605 నంబర్‌లకు కానీ జీఆర్పీ ల్యాండ్‌లైన్ నంబర్ 08912883218కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


సురేష్ మృతదేహం

గంట్యాడ: మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన లగుడు సురేష్ (40) గ్రామంలోని ముని అక్కమ్మ చెరువులో పడి మృతి చెందాడు. సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో కలువ పువ్వులు తీసుకోవడానికి చెరువులోకి ఈదుకుంటూ వెళ్లాడు. చెరువు మధ్యలోకి వెళ్లిన తర్వాత లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగి ప్రమాదవశాత్తు మరణించాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కూలిన ఇంటి గోడ


పరుశురాంపురంలో కూలిన గోడ

కొమరాడ: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కొమరాడ మండలంలోని పరుశురాంపురంలో సోమవారం వేకువజామున ఐదు గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన కొత్తకోట బాలకృష్ణ పాత్రుడు, సత్యనారాయణ పాత్రుడుల పాత ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదని స్థానికులు తెలిపారు. అధికారులు తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

బహిరంగంగా మందు కొడితే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరిక


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ మరోసారి సోమవారం మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ న్యూసెన్స్ చేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లు, మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లేఅవుట్లు, గ్రామ శివారు, నగర శివారు ప్రాంతాల్లో, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్లతో దాడులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 1520 కేసులు నమోదు చేశామన్నారు.

పోస్టల్ బీమా ఏజెంట్ల నియామకానికి ఆహ్వానం


పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

విజయనగరం టౌన్: విజయనగరం డివిజన్ తపాలాశాఖ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29 వరకూ అభ్యర్థులు తమ బయోడేటా, ఫొటో, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. నియామకం పూర్తయిన ఏజెంట్లకు పాలసీననుసరించి కమీషన్ ఇవ్వనున్నామని, నెలవారీ జీతం ఉండదని స్పష్టం చేశారు. 5వేల జనాభాకు తక్కువగా ఉన్న ప్రాంతంలో పదోతరగతి, 5వేల జనాభాకు పైన ఉన్న ప్రాంతంలో ఇంటర్ ఉత్తీర్ణులై, మార్కెటింగ్, ఇన్సూరెన్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పీజీఆర్‌ఎస్‌కు 188 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు వచ్చే వినతులను లాగిన్‌లో నిర్దేశిత సమయంలో పరిష్కరించకపోతే జిల్లా అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్ హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు లాగిన్‌లో చూడాలని చూడవలసిన కాలమ్‌లో ఎప్పుడు చూసినా సున్నా పరిష్కారం కనపడాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ లో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజీఆర్‌ఎస్‌కు 188 వినతులు అందాయి. కలెక్టర్‌తోపాటు జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డీసీలు మురళి, ప్రమీలా గాంధీ, వెంకటేశ్వరరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 36 ఫిర్యాదులు


ఫిర్యాదు దారుల సమస్యలను వింటున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ 36 ఫిర్యాదులను స్వీకరించారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోగా అవమానం

- మున్సిపల్ కమిషనర్‌పై చైర్‌పర్సన్ ఫిర్యాదు


మున్సిపల్ కమిషనర్‌పై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం రూరల్: తానొక ప్రథమ పౌరురాలు, బీసీ నేత అని చూడకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ఉద్దేశ పూర్వకంగా నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తూ తనను మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు అవమాన పరుస్తున్నారని పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు తనకు జరిగిన అవమానాన్ని వినతిపత్రంలో వివరించారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినం కార్యక్రమంలో ఉదయం 7.30గంటలకు కార్యక్రమానికి రమ్మని కార్యాలయం నుంచి తనకు ఆహ్వానం పంపి మళ్లీ ఫోన్ చేసి 9గంటలకు హాజరుకావాలని సమాచారం అందించారని, తాను 9 గంటలకు వెళ్లగా శాసనసభ్యులు రాలేదని తనతో పాటు తోటి కౌన్సిల్ సభ్యులను నిరీక్షించమని చెప్పి 10 గంటల వరకు కాలయాపన చేశారన్నారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా పట్టణ ప్రథమ పౌరురాలైన తనతో జాతీయజెండాను ఎగురవే యించాల్సిన నేపథ్యంలో కావాలని ఉద్దేశపూర్వకంగా చైర్‌పర్సన్ అయిన తనను అవమాన పరుస్తూ శాసనసభ్యుడితో ఎగురవేయించారని తెలిపారు. అలాగే పట్టణ పరిధిలో ఈ నెల 20న బైపాస్ రోడ్డులో జరిగిన సీసీ కాలువ భూమి పూజ కార్యక్రమానికి ప్రోటోకాల్ నిబంధనలు పాటించకుండా కావాలనే తనను అవమానపరుస్తున్నారని చైర్‌పర్సన్ గౌరీశ్వరి తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన తనపై కమిషనర్ శ్రీనివాసరాజు ప్రోటోకాల్ ఉల్లంఘన కింద ఈ విధంగా ప్రవర్తించకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే ప్రాంతీయ మున్సిపల్ సంచాలకుడికి ఫిర్యాదు చేస్తున్నట్లు ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- ఈనెల 30 నుంచి భీమవరంలో జరగనున్న పోటీలు


ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని విజ్జి స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరుకాగా చీఫ్ కోచ్ డీవీ చారిప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఎం.తేజశ్విని, కె.హిమశ్రీ, టి.యమున, ఎస్.తనూజ, కె.జస్వంత్, కె.ఆకాష్, టి.భానుమతి, పి.ధరహాసిని, వి.కేసవి, పి.కాశీచరణ్, సీహెచ్ ప్రేమసాయి, బి.చైతన్య, హర్షిత, శ్రీహతి, డి.సూర్యప్రభాత్, డి. ధీరజ్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి భీమవరంలో జరగనున్న అంతర్ జిల్లా అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాల పక్కనే పశువుల అక్రమ రవాణా


మండల పరిషత్ పాఠశాల పక్కన తిష్ట వేసిన పశువులు

కొమరాడ: మండలంలోని చిన మార్కొండపుట్టి గ్రామంలో మండల పరిషత్ పాఠశాల పరిసరాల్లో పరశురాంపురం కేంద్రంగా అక్రమ పశు దందా జరుగుతోంది. కొంతమంది పశువుల అక్రమ రవాణా వ్యాపారులు పాఠశాల పక్కనే వందలాది పశువులు కడుతుండడం వల్ల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒడిశాలోని రాయగడ, అమలబడి తదితర ప్రాంతాల నుంచి కిలోమీటర్ల దూరం వాటిని నడిపించి గ్రామానికి తీసుకువస్తున్న నేపథ్యంలో అవి నడవలేక రక్తస్రావంతో పాటు నీరసంతో పశువులు మృతి చెందడంతో ఆ పరిసర ప్రాంతంలో పశు కళేబరాల కుళ్లు కంపుతో పాటు దోమలు, దుర్వాసన రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని గ్రామస్తులు ఎంత చెప్పినా అక్రమ వ్యాపారులు పట్టించుకోవడం లేదు. ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాల పరిసరాల్లో అక్రమ పశుదందాను అరికట్టాలని వారంతా కోరుతున్నారు.

సినీ సంగీత విభావరికి ఏర్పాట్లు పూర్తి


కరపత్రికలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించనున్న రామకృష్ణ సినీ సంగీత విభావరికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు సోమవారం తెలిపారు. ఈ మేరకు కళాపీఠం ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయి, పవన్‌ల సంగీత సారథ్యంలో ప్రముఖ వాయిద్య కళాకారులు, గాయనీ, గాయకులతో అద్భుతమైన గీతాలాపన ఉంటుందన్నారు. సంగీతాభిమానులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాపీఠం ప్రతినిధులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

విజయనగరం అర్బన్: డీఎస్సీ-2025 ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈ నెల 28, 29 తేదీల్లో డెంకాడ మండలం మోదవలసలోని ఓయిస్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తామని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. అభ్యర్థుల వక్తిగత మెగా డీఎస్సీ-2025 లాగిన్ ఐడీకి మంగళవారం నుంచి పంపించిన కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకుని అందులో పేర్కొన్న సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఇటీవల జారీ చేసిన కులధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ధ్రువీకరణ, కాల్ లెటర్‌లో సూచించిన ఇతర పత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలు, 5 పాస్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను ముందుగా వ్యక్తిగత లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మెరిట్, అర్హత, రిజర్వేషన్, సంబంధిత నియమ నిబంధనల ఆధారంగా జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు హెల్ప్‌డెస్క్ నంబర్లు 8639791622 (అవినాష్), 95503 94572 (మన్మథరావు)లను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు


అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పతకాలు సాధించారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు లీలాకృష్ణ, శ్రీకాంత్‌లు తెలిపారు. పతకాలు సాధించిన వారిలో పి.వసంత, ఎస్.దివ్యవాణి, ఎస్.శ్రావణి, బి.నీలిమ, పి.పవన్‌కల్యాణ్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి శ్రీధర్ అభినందించారు.

కిమిడి సోదరుడి మృతి


కిమిడి నీలం నాయుడు (ఫైల్)

రేగిడి: మండల కేంద్రం రేగిడి గ్రామానికి చెందిన కిమిడి నీలంనాయుడు (71) సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావుకు స్వయానా సోదరుడు. నీలంనాయుడు గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చిట్టీల పేరుతో టోకరా

భోగాపురం: మండలంలోని సిమ్మపేట గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రూ.22 లక్షలు చిట్టీలు వేసి ఉడాయించేందుకు సిద్ధమవ్వగా చిట్టీలు వేసిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై పాపారావు ఇరు వర్గాలను పిలిపించి విచారణ చేపట్టగా చిట్టీలు వేసిన వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడడం వల్ల డబ్బులు పోయి అప్పుల్లో మునిగిపోయానని చెప్పాడు. తాను ఎవరిని మోసం చేయనని, అప్పులు తీర్చేద్దామని సిమ్మపేటలో తనకున్న ఇల్లును ఇతరులకు అమ్మేయగా వచ్చిన ఆ డబ్బులను పెద్దమనుషుల దగ్గర ఉంచానని చెప్పాడు. ఇంతలో బాధితులంతా కలిసి అప్పులు తీర్చమని అడగ్గా వారికి చిట్టీల నిర్వాహకుడు రాసి ఇచ్చిన ప్రాంసరీ నోట్లను పోలీసులకు చూపించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి


మురళి మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి యలమంచిలి మురళి (35) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. దీనిపై ఎస్సై కె.శేఖర్ తెలిపిన వివరాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం పనుకుపేట గ్రామానికి చెందిన మురళి మూడేళ్ల క్రితం కుటుంబంతో సహా బొద్దాం గ్రామానికి బతుకుతెరువు కోసం వచ్చాడు. ఇక్కడ తాపీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన అల్లు రామకృష్ణ టీ దుకాణం మరమ్మతుల పనికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురి కావడంతో గమనించిన స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సొంత బ్రాండ్.. మందుబాబులకు బ్యాండ్!

- మద్యం బాటిల్‌పై ప్రత్యేక స్టాంప్‌తో సిండికేటు వ్యాపారం
- బెల్టు దుకాణాలకు ప్రత్యేకం
- చీప్ లిక్కర్ క్వార్టర్‌పై రూ.10 అదనం
- బాటిల్‌పై స్టాంప్ చూస్తే ఎక్సైజ్, పోలీసులూ వదిలేయాల్సిందే!


చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్‌పై ఉన్న సిండికేట్ స్టాంప్

చీపురుపల్లి: మద్యం వ్యాపారులు సిండికేటుగా మారారు. సొంత బ్రాండ్‌తో మందుబాబులపై ధరల బ్యాండ్ మోగిస్తున్నారు. ఒక్కో సీసాపై రూ.10 ధర పెంచి నిలువునా దోపిడీ చేసేందుకు పూనుకున్నారు. దీనికోసం మద్యం సీసాలపై సొంతంగా రూపొందించిన స్టిక్కర్లు అతికించి బెల్టుదుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి వచ్చిన మద్యం బాటిళ్లపై స్టిక్కర్లు, స్టాంపులు ఉండడం తెలిసిందే. ఇప్పుడు జిల్లాలోని మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి సొంత స్టాంప్‌లు అమల్లోకి తీసుకురావడం చర్చాంశనీయంగా మారింది. చీపురుపల్లి నియోజవకర్గంలో సరఫరా చేస్తున్న మద్యం బాటిళ్లపై ఈ స్టాంపులు దర్శనమివ్వడం కలకలం రేగుతోంది. కేవలం చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచి ప్రజలతో పూటుగా తాగించి సొమ్ము చేసుకోవాలనేది మద్యం వ్యాపారుల లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ఏ బెల్టు దుకాణంలో ఈ స్టాంప్‌తో చీప్ లిక్కర్ బాటిల్ కనిపించినా ఎక్సైజ్, పోలీస్ శాఖ నుంచి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదనేది సిండికేటు నిబంధనగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. సంపద సృష్టిస్తానంటూ మైక్ దొరికినప్పుడల్లా చెబుతున్న సీఎం చంద్రబాబు మద్యం ద్వారా సంపద సృష్టించే పనిలో ఉన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ ఎక్సైజ్ సర్కిల్ నుంచి నెలకు టారిఫ్ విధించడం ఈ వాదనకు బలం చేకూర్చుతోంది. చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధి నుంచే నెలకు రూ.11.50 కోట్లు వ్యాపారం జరగాలన్నది ప్రభుత్వం విధించిన షరతు. అందులో భాగంగానే ఎక్సైజ్ అధికారులు కూడా సిండికేటుకు తలొగ్గక తప్పడం లేదనే చర్చ జరుగుతోంది. ఈ మద్యం దందా విషయమై కూటమి ప్రభుత్వంలో భాగస్వాములై ఉన్న జనసేన పార్టీ నాయకులే స్వయంగా సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేయడం, సాక్షాత్తూ అబ్కారీ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకెళ్లడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

బెల్టు దుకాణాలకు ప్రత్యేకం...

చీప్ లిక్కర్ బాటిల్‌పై రూ.10 ధర పెంచి లైసెన్స్ మద్యం దుకాణం నుంచే బెల్టు దుకాణాలకు డంప్ చేస్తారు. ఆ బాటిల్‌పై సిండికేటు స్టాంప్ వేస్తారు. కేవలం ఒక రెండు దుకాణాలు నుంచి మాత్రమే బెల్టు దుకాణాలకు సరుకు డంప్ చేస్తారు. వచ్చిన ఆదాయం అన్ని దుకాణాలకు సర్దుబాటు చేసుకుంటారు. బాటిల్‌పై స్టాంప్ ఉంటే ఎక్సైజ్, పోలీస్ ఎవరైనా సరే చూసి వదిలేయాల్సిందే. బాటిల్‌పై స్టాంప్ లేకపోతే ఇతర ప్రాంతాలు నుంచి మద్యం వస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేయాల్సిందే.

బాటిళ్లపై ఎలాంటి స్టాంప్‌లు లేవు

> లైసెన్స్ మద్యం దుకాణాల్లో విక్రయించే మద్యం బాటిళ్లపై ఎలాంటి స్టాంపులు లేవు. నిబంధనలకు వ్యతిరేకంగా అలాంటి కార్యక్రమాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రోత్సహించదు. చీపురుపల్లి సర్కిల్ పరిధిలో ఇలాంటి సంఘటనలు లేవు. మద్యం దుకాణాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. – సీహెచ్.చక్రవర్తి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్

అర్జీదారుల సమస్యకు తగిన పరిష్కారం చూపండి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్
- పీజీఆర్‌ఎస్‌కు 107 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: అర్జీదారుల సమస్యలకు తగిన పరిష్కారం చూపించి కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు తేల్చి చెప్పారు. పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలతో కచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని వారికి అందజేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్‌ఓ కె.హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణిలు అర్జీదారుల నుంచి మొత్తం 107 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి సమస్యను సావధానంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలో ఉన్న పలుశాఖల ఉన్నతాధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించండి: ఏఎస్పీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని ఏఎస్పీ అంకితా సురానా అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఏఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత స్టేషన్ అధికారులకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో 3 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్‌బీ ఎస్సై ఫక్రుద్దీన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్‌ఎస్‌కు 21 అర్జీలు


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం ప్రాజెక్టు అధికారి పవర్ స్వప్నిల్, జగన్నాథ్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 21 అర్జీలు వచ్చాయి. పట్టులోగా ఆశ్రమపాఠశాలలో కుల దూషణపై, ఇతర సంఘటనలపై గ్రూప్‌వన్ అధికారితో విచారణ చేయించాలని స్కూల్ కమిటీ చైర్మన్ సవర లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం నాయకులు సవర ధర్మారావు తదితరులు వినతిపత్రం ఇచ్చారు. లాడ గ్రామంలో అంతర్గత సీసీ రహదారులు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. తోరికవలసకు నూతన పాఠశాల భవనం నిర్మించాలని పి.లక్ష్మయ్య అర్జీ ఇచ్చారు. వడ్డంగిగూడకు చెందిన రఘు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, డిప్యూటీఈఓ రామ్మోహన్‌రావు, ఈఈ రమాదేవి, వ్యవసాయాధికారి వాహిని తదితరులు పాల్గొన్నారు.

సమసిన వివాదం

- గోదాం యజమాని నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం
- మృతిపై సమాచారం ఇచ్చినా స్పందించని యాజమాన్యం
- మృతదేహం కదిలించేది లేదని కుటుంబసభ్యుల మొండి పట్టు

రామభద్రపురం: మండలంలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న ఆల్ట్రాటెక్ సిమెంట్ గోదాం వద్ద ఆదివారం సాయంత్రం విద్యుత్ షాక్ తగిలి మండలం పరిధిలో గల జన్నివలస గ్రామానికి చెందిన ముచ్చుపల్లి శ్రీనివాసరావు మృతి చెందిన సంఘటన తెలిసిందే. అయితే ఇదే విషయంపై మృతుడి కుటుంబసభ్యులు గోదాం యజమానికి సమాచారం ఇవ్వగా తనకేమీ తెలియదన్నట్లు యాజమాన్యం కనీసం స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించ నివ్వకుండా కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. అలాగే గ్రామపెద్దలతో పాటు ప్రజలు సుమారు 200 మందితో కలిసి జీవనాధారమైన ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. సిమెంట్ గోదాంలో పనిచేస్తూ యాజమాన్యం నిర్లక్ష్యానికి బలైన శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఎస్సై వి. ప్రసాదరావుతో పాటు జన్నివలస గ్రామ పెద్దలు, రామభద్రపురం గ్రామ పెద్దలు, రామభద్రపురం సిమెంట్ వ్యాపారులు సిమెంట్ గోదాం యజమానితో మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని చర్చించారు. యజమాని ససేమిరా అంటూ పరిహారం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. దీంతో కార్మిక యాక్ట్ ప్రకారం యాజమాన్యంపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించడంతో దిగొచ్చిన యాజమాన్యం విద్యుదాఘాతంతో మృతిచెందిన శ్రీనివాసరావు కుటుంబానికి సుమారు రూ.4 లక్షల వరకు పరిహారం ఇవ్వడానికి అంగీకరించినట్లు తెలిసింది. దీంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు శాంతించి వివాదం ముగించారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.


పోలీస్ స్టేషన్‌లో గ్రామ పెద్దలతో చర్చలు జరుపుతున్న ఎస్సై వి.ప్రసాదరావు